www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024
5
వైఎస్ఆర్



షోకాజ్ నోటీసులు రద్దు

ప్రజాశక్తి-కడప అర్బన్ : అపార్ నమోదులో నిర్లక్ష్యంగా ఉన్నారని జిల్లాలో 829 మంది ప్రధానోపాధ్యాయులకు డిఇఒ మీనాక్షి ఇచ్చినటువంటి షోకాజ్ నోటీసులను శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి చొరవతో ఆపివేశారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. నోటీసులు ఇవ్వడానికి లేదని మంత్రి ఖరాఖండిగా చెప్పారు. ఆయన సూచనల మేరకు కమిషనర్ విజయరామరాజుతో ఎమ్మెల్సీ మాట్లాడారు. నోటీసులు ఇవ్వవద్దని, ఏదైనా ఉంటే నమోదులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఎమ్మెల్సీ డిఇఒకు చెప్పారు. మంత్రి సూచన మేరకు నోటీసులు ఇవ్వడం ఆపివేయాలని డిఇఒకు ఎమ్మెల్సీ చెప్పగా ఆమె అంగీకరించారు. వాటిని రద్దు చేస్తున్నట్లు డిఇఒ తెలిపారు. ఉపాధ్యాయులు ఎవరూ ఆందోళన చెందవద్దని, విద్యాశాఖ అధికారులకు సహకరించాలని ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి ఉపాధ్యాయులను కోరారు.

ఎడతెగని 'అపార్' కష్టాలు

- 26 శాతం పెండింగ్‌పై ఆగ్రహం
- 829 మంది హెచ్‌ఎంలకు నోటీసులు
- డిఇఒ తీరుపై సర్వత్రా విమర్శలు

అపార్‌కు అప్‌లోడ్ కష్టాలు ఎడతెగడం లేదు. ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ప్రవేశపెట్టిన అపార్ యాప్‌లో విద్యార్థుల వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టింది. జిల్లాలోని విద్యార్థుల పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్, రేషన్‌కార్డులు, బర్త్ సర్టిఫికెట్లలో తప్పులు లేకుండా సరిచేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అపార్, ఎకనమిక్, జనరల్ ప్రొఫైల్స్ అప్‌లోడ్ బాధ్యతల్ని జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు అప్పగించింది. మూడు నెలలుగా అపార్ లక్ష్యాలను అందుకోలేదనే ఉద్దేశంతో డిఇఒ సమగ్ర సిబ్బంది జీతాలను నిలిపేయడం దగ్గర నుంచి తాజాగా బుధవారం రాత్రి 829 మంది ప్రధానపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం వరకు చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా విద్యాశాఖకు అపార్ కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో 36 మండలాల ఎంఇఒ కార్యాలయాల పరిధిలోని 3,038 స్కూళ్లు ఉన్నాయి. సుమారు 3.40 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరి వివరాలను అపార్‌తో సహా ఎకమిక్ ప్రొఫైల్స్, జనరల్ ప్రొఫైల్స్ అప్‌లోడ్ చేయాల్సిన బాధ్యతల్ని ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అప్పగించింది. మూడు నెలలుగా సదరు ప్రధానోపాధ్యాయులు అపార్, ఎపి, జిపి అప్‌లోడ్ పనుల్లో నిమగ్నమయ్యారు. మూడు నెల్లో 74.84 శాతం అప్‌లోడ్ చేశారు. మిగిలిన 26 శాతాన్ని అపార్ అప్‌లోడ్ చేయడంలో వెనుకబడ్డారనే కారణంతో బుధవారం రాత్రి 829 మంది ప్రధానోపాధ్యా యులకు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అపార్, ఇపి, ఎపి అప్‌లోడ్ పూర్తి చేయడంలో వెనుకబాటుతనానికి కారణాలు ఏమిటని ఆరా తీస్తే బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డుల్లో పిల్లల, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీలకు పొంతన లేకపోవడమే కారణమని తెలుస్తోంది. ఇటువంటి తరహా విద్యార్థుల వివరాలను సరిచూసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంది. పలువురు విద్యార్థుల బర్త్‌సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డుల్లోని పేర్లు, పుట్టిన తేదీల్లో తేడాలు ఉండడం, మరికొందరు విద్యార్థులు తల్లి దండ్రులు వలసలు రావడం, మరికొందరు తల్లిదండ్రులు బతుకు దెరువు నిమిత్తం గల్ఫ్‌దేశాల్లో ఉండడంతో ఆధార్‌కార్డులు, బర్త్ సర్టి ఫికెట్లు అందుబాటులో లేకపోవడం, కొత్త సర్టిఫికెట్ల మంజూరు కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగడానికి నెలల తరబడి సమయం తీసుకోవడం కనిపిస్తోంది. కొంతమంది వలసలు వచ్చిన తల్లిదండ్రులు అపార్ అప్‌లోడ్ ప్రక్రియకు ప్రాధాన్యత ఇవ్వకపో వడం కూడా వెనుకబాటుతనానికి కారణమని తెలుస్తోంది. జిల్లా విద్యాశాఖాధికారి అపార్ అప్ లోడ్ లక్ష్యాల్లో వెనుకబడ్డారనే కారణంతో గత అక్టోబర్, నవంబర్ మాసాలకు సంబంధించిన ఎస్ఎస్ఎ సిబ్బంది జీతాలను నిలిపేయ డం, తాజాగా 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఉపాధ్యాయ సంఘాల నుంచి విమర్శలకు ఆస్కారం కలిగిస్తోంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కడప జిల్లా 74 శాతం అప్‌లోడ్ లక్ష్యంతో 12, 13 స్థానాల్లో, జోన్ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. మెరుగైన స్థానాల్లో జిల్లా నిలిచినప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులతో సంబంధం లేకుండా ఎస్ఎస్ఎ సిబ్బంది మొదలుకుని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడిని తీవ్రతరం చేయడం, బెదిరింపులతో పని చేయించుకోవాలని చూడడం తగదనే వాదన వినిపిస్తోంది.

లక్ష్యాన్ని అందుకోవాలనే నోటీసులు

అపార్ లక్ష్యాన్ని అందుకోవాలనే ఉద్దేశంతోనే నోటీసులు జారీ చేశాం. మూడు నెలలుగా ప్రోగ్రెస్ కనిపించింది. స్టాగ్నేషన్ పాయింట్ రావడంతో పనులు వేగవంతం చేయడంలో భాగంగానే నోటీసులు జారీ చేయడమైంది.

- యు.మీనాక్షి, డిఇఒ, కడప.

షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి

జిల్లాలోని 829 మంది ప్రధానోపాధ్యాయులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఒత్తిడిని తీవ్రతరం చేయడం తగదు.

- పి.మహేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప.

బెదిరింపు ధోరణి సరికాదు

ఉపాధ్యాయులపై బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదు. వివిధ రకాల యాప్‌లతో సతమతమవుతున్నారు. చిన్న, చిన్న కారణాలతో షోకాజ్ నోటీసులు జారీ చేయడం తగదు.

- పి.రమణారెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి, కడప.

నోటీసులు జారీ చేయడం తగదు

జిల్లాలోని 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం తగదు. క్షేత్రస్థాయిలో విద్యార్థుల ఆధార్, బర్త్ సర్టిఫికెట్లలోని లోపాల కారణంగానే వెనుకబాటుతనం కనిపిస్తోంది.

- ఎం.వెంకటశివారెడ్డి, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప.

నోటీసులు ఇవ్వడం సరికాదు

ఏకపక్షంగా ప్రధానోపాధ్యాయులకు డిఇఒ నోటీసులు ఇవ్వడం సరికాదు. వెంటనే ఉపసంహరించుకోవాలి. లేకపోతే ధర్నా చేయాల్సి వస్తుంది.

- లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం.



డిఇఒ కార్యాలయం ఎదుట వర్షంలో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

షోకాజ్ నోటీసుల జారీలో డిఇఒ వైఖరి సరికాదు

- నిరసనలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్ : అపార్ పూర్తి చేయలేదనే కారణంగా జిల్లాలోని వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న 829 మంది ఉపాధ్యాయులకు డిఇఒ షోకాజ్ నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబులు అన్నారు. ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం డిఇఒ కార్యాలయం వద్ద వర్షంలో గొడుగులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వివరాలను సేకరించేందుకు ప్రభుత్వం అపార్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. విద్యార్థుల జనన తేదీ పాఠశాల రికార్డులకు, విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రాలకు సరిపోకపోవడం, ఇతర జిల్లాల నుంచి మరో ప్రాంతానికి వచ్చి వలస వచ్చిన విద్యార్థుల వివరాలు సక్రమంగా అందుబాటులో లేకపోవడం మూలాన అపార్ నమోదులో కొంతమేరకు జాప్యం మవుతుందని చెప్పారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారని పేర్కొన్నారు. షోకాజు నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, సి.వి.రమణ, నాయకులు బత్తుల చంద్రశేఖర్, జి.గోపీనాథ్, వై.రామ కేశవ, ఎం.బాబు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత కార్యదర్శులతో కలిసి రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో విసి ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్ శ్రీధర్‌తోపాటు జెసి అదితి సింగ్ హాజరయ్యారు. మంత్రి విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ఈ నెల 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సదస్సులలో మ్యూటేషన్లు, భూ వివాదములు, భూ ఆక్రమణలు, తదితర అంశాలపై గ్రామస్తుల నుండి అర్జీలను స్వీకరించి వెంటనే రశీదు జారీ చేయాలన్నారు. 40 రోజుల్లోగా విచారణకు వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు జారీ చేసేందుకుప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఫ్రీ హోల్డ్ లాండ్స్ జిఒ ప్రకారంగా అనుమతించిన పట్టాలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జడ్‌హెచ్‌డిసి భూముల వివరాలను సేకరించాలన్నారు. ఇప్పటి వరకు ఆయా భూముల అనుభవదారులకు ఏవైనా ప్రభుత్వ లబ్ధి పొందివున్నారా అనే అంశాల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆర్‌డిఒలను కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో డిఆర్‌ఒ విశ్వేశ్వర్‌నాయుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, ఎస్‌డిసి ఎల్.ఎ. శాంతమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయండి : ఈ నెల 6వ తేదీ నుండి 2025 జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేటులోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో రెవెన్యూ సదస్సుల నిర్వహణ, ఏర్పాట్లపై ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 45 రోజులపాటు జరగనున్న రెవెన్యూ సదస్సులలో అన్ని రికార్డులు, డాక్యుమెంట్లు, కంప్యూటర్లు తదితరాలను ఉంచుకోవాలని చెప్పారు. అర్జీదారుని అర్జీని పరిష్కరించే బాధ్యత మనదేనన్నారు. రెవెన్యూ సదస్సుల కార్యక్రమం అనంతరం మరుసటి రోజు అర్జీదారుని ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకోవాలని, ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవాలని అర్జీదారులతో సెల్ఫీఫొటో తీసుకోవాలన్నారు.

ఎపిజిబిని తరలించొద్దంటూ 6న సంతకాల సేకరణ : సిపిఎం



సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడానికి నిరసిస్తూ ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు ఐటిఐ సర్కిల్లో సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ తెలిపారు. బుధవారం నగరంలోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిజిబిని ఇతర బ్యాంకులో విలీనం చేసి రాష్ట్ర స్థాయి బ్యాంకింగ్‌గా చేయడానికి స్వాగతిస్తోందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఉన్న రైతాంగం, ప్రజల ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని ప్రధాన కార్యాలయాన్ని కడపలో ఉంచేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంప్రదాయం ప్రకారం చూసినా, ఆర్థిక శాఖ మార్గదర్శకాల్లో తొలి ప్రాధాన్యత ప్రకారం చూసినా ఎపిజిబి రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించడమే సరైందన్నారు. వ్యాపారం, టెక్నాలజీ, ఆర్‌బిఐ అనుమతించిన చెస్ట్ సౌకర్యం, సొంత భవనాలు, ప్రజా భవనాలు విలీనం అవుతున్న సప్తగిరి, చైతన్య గోదావరి, ఎపి వికాస్ బ్యాంక్ కంటే మిన్నగా కడపలోని ఎపిజిబికె ఉన్నాయన్నారు. నూతన రాష్ట్ర స్థాయి ఎపిజిబి పాలసీ, రుణ పరపతి విధానం, చిన్న పరిశ్రమలకు అందించే తోడ్పాటు, వృత్తి దారులకు, వ్యాపార వర్గాలకు అందించే తోడ్పాటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాయలసీమ లాంటి వెనకబడిన ప్రాంతాల్లో ఎపిజిబి ప్రధాన కార్యాలయం ఉంటేనే ఆ ఒరవడి కొనసాగుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల అభిప్రాయాలను గమనంలో పెట్టుకుని ప్రభుత్వం విలీనం తర్వాత ఏర్పడబోయే రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని, అమరావతికి తరలించవద్దని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

- వైవీయూ విసి ఆచార్య కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రణాళిక బద్ధమైన చదువులతో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకుంటారని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం గురుకులం క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సీనియర్లు తమ జూనియర్‌లకు ఫ్రెషర్స్ పార్టీని బుధవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు నిరంతరం శ్రమిస్తూ వైవీయూ వనరులను వినియోగించుకోవాలన్నారు. క్రమశిక్షణతో మెలగడం, గ్రంథాలయాన్ని వినియోగించుకోవడం, అధ్యాపకుల సలహాలు నిరంతరం అమలు చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం ప్రగతికి మార్గాలన్నారు. ఎంబిఎ విభాగ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు భయపడకుండా ఉండాలని, ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని ఉద్బోధించారు. డీన్ ప్రొఫెసర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు ముంగిటకు వస్తాయన్నారు. నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమం ఏర్పాటుచేసిన సీనియర్ విద్యార్థులను ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ అమృత్ ప్రసాద్‌రెడ్డి అభినందించారు. కమ్యూనికేషన్, లైఫ్ స్కిల్స్, డిసిప్లెన్స్ వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వైవీయూ ఎంబిఎ విద్యార్థులకు బ్రాండ్ అంబాడిసర్‌లుగా మారాలని సహ ఆచార్యులు డాక్టర్ సరిత విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. క్యాంపస్‌లో జూనియర్లు తమ అనుభవాలను పంచుకున్నారు. సీనియర్ విద్యార్థులు నిర్వహించిన మేనేజ్‌మెంట్ గేమ్స్‌లో విజేతలకు విసి ఆచార్య కృష్ణారెడ్డి ఇతర అధ్యాపకులు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమానికి దాదాపు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న వైవీయూ విసి ఆచార్య కృష్ణారెడ్డి



చెర్లోపల్లెలో వైసిపి నాయకులతో సుగవాసి బాలసుబ్రమణ్యం

వైసిపి నాయకులతో 'సుగవాసి' మంతనాలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మండల పరిధిలోని చెల్లోపల్లి గ్రామంలో బుధవారం రాజంపేట నియోజకవర్గ నాయకులు సుగావాసి బాలసుబ్రమణ్యం మండల వైసిపి కన్వీనర్ సుబ్బారెడ్డి, మాధవరెడ్డి పిలుపుమేరకు గ్రామంలో పర్యటించారు. ఒంటిమిట్ట మండలంలో వైసిపికి అధిక ప్రాధాన్యత గ్రామమైన చర్లోపల్లి నాయకులతో కలిసి సుగవాసి పర్యటించడంపై మండలలో చర్చనీయంశంగా మారింది. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఈ విషయంపై చర్చింకుంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో టిడిపి కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడుతుంటే కార్యకర్తలను సంప్రదించకుండా వైసిపి నాయకులు, కార్యకర్తలను సంప్రదించటం ఏంటని టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. సుగవాసి బాలసుబ్రమణ్యం తరచూ వైసిపి నాయకులు, కార్యకర్తలను కలవడంలో ఆంతర్యం ఏమిటో తెలియడం లేదని టిడిపి శ్రేణులు పేర్కొంటున్నారు.

అధిక రేట్లను నియంత్రించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రజల వినోదాన్ని ఆదాయం వనరుగా మార్చుకుంటూ ప్రజల జేబులకు చిల్లు పడే విధంగా వున్న అధిక టికెట్ల రేట్లను నియంత్రించాలని డివైఎఫ్ఐ నగర కన్వీనర్ విజయ్ కోరారు. బుధవారం కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కుటుంబ సమేతంగా వినోదం కోసం సినిమాలకు వస్తారని తెలిపారు. ప్రస్తుత రోజులలో రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. కొత్త సినిమా ఏదైనా విడుదల సమయంలో విపరీతంగా టికెట్ల రెట్లు పెంచి ప్రజల జేబులకు చిల్లులు పడే విధంగా వున్నాయన్నారు. ప్రస్తుతం రిలీజు అవుతున్నా పుష్ప సినిమాకు టికెట్ల రెట్లు చూస్తే కళ్లు బయర్లు కమ్ముతున్నాయని పేర్కొన్నారు. బెనిఫిట్ షో,మొదటి రోజు షో పేరుతో రూ.1000 నుంచి మొదలుకుని ఆ పైన వేల రూపాయల వరకు టికెట్ల రెట్లు పెట్టారంటే ఏవిధంగా ప్రజలను దోచుకుంటున్నారో అర్థం అవుతుందన్నారు. ప్రభుత్వాలు సైతం భారీ బడ్జెట్ పేరుతో సినిమాలు తీస్తున్నారని, టికెట్ల రెట్లు పెంచుకునే అవకాశం ఇవ్వడం కూడా సరైనది కాదన్నారు. అధిక రేట్లకు టిక్కెట్లును నియంత్రించాలని, లేకుంటే గా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

14న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి - కడప : జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా కడప జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ కోరారు. పూర్తి సమాచారం కోసం 08562-258622, 244622 నంబర్లకు ఫోన్ ద్వారా గాని, (kadapa.dcourts.gov.in), (dlsakdp@gmail.com) ఇమెయిల్ ద్వారా గాని సంప్రదించవచ్చునని తెలిపారు.

ఎయిడెడ్ పోస్టుల నియామకాల్లో భారీ కుంభకోణం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాహుల్, రవి

ప్రజాశక్తి-కడప అర్బన్

డయాసిస్ ఆఫ్ కడప సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎయిడెడ్ పోస్టులు భర్తీలో భారీ కుంభకోణం చోటుచేసుకుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దుల రాహుల్, వీరపోగు రవి పేర్కొన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పోస్టుల నియామకం అతలా కుతలం చేశారని పేర్కొన్నారు. ఆర్‌సిఎం పాఠశాలలోని ఖాళీలను రిక్రూట్ చేయడానికి దాదాపు 35 పోస్టులను వదిలారని పేర్కొన్నారు. ఆయా పోస్టులకు గాను 2024, మార్చ్ 13వ తేదీన న్యూస్ పేపర్ లో ఒక చిన్న ఉద్యోగ ప్రకటన వేసి ఆ ఉద్యోగాలలో ఎస్ జి టి పోస్టుల వివరాలను ప్రచురించారని తెలిపారు. అర్హులైన వారు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోమని చివరి తేదీగా 22/03/2024, మార్చి 22 అని చెప్పారని పేర్కొన్నారు. ఎంపిక విధానాన్ని ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఒక్కో పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు డబ్బులు వసూలు చేసి ఆ పోస్టులను అమ్ముకున్నారని తెలిపారు. కడప మేత్రాసనం యత్రాంగం, మరి కొద్దిమంది ఒక కమిటీగా చేరి వారి బంధువులకు, పిల్లలకు మాత్రమే పోస్టులను ఇచ్చారని తెలిపారు. ఈ ఎంపిక విధానాన్ని గమనించి ఇది ముమ్మాటికి హెయమైన చర్యగా భావించి కోర్టులో నోటిఫికేషన్ మీద కేసు ఫైల్ అయిందని చెప్పారు. జాగ్రత్త పడ్డ కడప మేత్రాసనం కమిటీ నామకర్థముగా డిపార్ట్మెంట్ నియమించే ఒక ప్రవేశ పరీక్షను వారే పెట్టి చివరకు ఎవరెవరైతే డబ్బులు ఇచ్చారో వాళ్లకు మాత్రమే పోస్టులను ముట్ట చెప్పారని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష పెట్టక మునుపే ఎవరెవరికి ఉద్యోగాలు ఇవ్వాలో ఫైనల్ లిస్ట్‌ని తయారు చేసుకున్నారని చెప్పారు. అర్హులైన నిరుద్యోగులు ఎంతోమంది ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ నోటిఫికేషన్‌ను మరలా పునఃప్రారంభించి ప్రభుత్వ నియమనిబంధనల మేరకు ఉద్యోగాలను రిక్రూట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు మోహన్ పాల్గొన్నారు.

చిన్నచౌక్ సిఐగా ఓబులేసు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్



కడప నగరంలోని చిన్నచౌక్ పోలీసుస్టేషన్ సిఐగా ఓబులేసు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లలో సిఐగా విజిలెన్స్ విభాగంలో ఆయన పని చేశారు. ఇక్కడ పనిచేస్తున్న పూర్వపు సిఐ తేజమూర్తిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సిఐ ఓబులేసు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సురేఖ, వైస్ ప్రిన్సిపల్ విజయభాస్కర్‌రెడ్డి

ఫుట్‌బాల్ పోటీలకు రిమ్స్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కడప సిటీ

అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీల్లో ఇద్దరు రిమ్స్ వైద్య విద్యార్థులు ఎంపికయ్యారని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో రిమ్స్ విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని తెలిపారు. విజయవాడలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ జరిగిన ఎంపికల్లో వారు అత్యున్నత ప్రతిభ ప్రదర్శించారన్నారు. కృష్టీ.ఎ.మ్యాథ్యూ (2024 బ్యాచ్), అహ్మద్ షజిజ్ కురిక్కల్ (2003 బ్యాచ్) విద్యార్థులు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఫుట్బాల్ టీమ్‌లో స్థానం సంపాదించారన్నారు. తమ విద్యార్థులు సాధిస్తున్న విజయాలను అడిషనల్ డిఎంఇ అభినందించారని తెలిపారు. మరిన్ని విజయాలు పొందాలని ఆకాంక్షించారు

6న ఎంఎస్ఎంఇపై అవగాహన సదస్సు

- కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ మురళీమోహన్

ప్రజాశక్తి - కడప

సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పారిశ్రామిక రంగాలను ప్రోత్సహించే దిశగా ఈ నెల 6వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు ఎంఎస్ఎంఇ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కెనరా బ్యాంక్ కడప రీజినల్ మేనేజర్ కె.మురళీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప లోకల్ బ్యాంక్ శాఖ అధికారులు అందరూ వివిధ ఎంఎస్ఎంఇ రుణాల మీద అవగాహన కలిగిస్తారని తెలిపారు. కడప ప్రాంతంలో ఉండే పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య, కోవిడ్, అడిషనల్ కార్మికులకు నవంబర్ నెల జీతాలు వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. బుధవారం 32, 34, 35వ డివిజన్లలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 48 వేల మంది ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు డిసెంబర్ 3వ తేదీ గడిచినా జీతాలు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని పేర్కొన్నారు. ఇంటి కిరాయి, కిరణా షాపుల్లో అప్పులు తీర్చకపోవడంతో కొత్త అప్పులు ఇవ్వడానికి యజమానులు ససేమిరా అంటున్నారని తెలిపారు. పిల్లల స్కూలు ఫీజులు, విద్యుత్ బిల్లులు, మందుల ఖర్చులు, అవసరాలు తీరక మున్సిపల్ కార్మికులు అగచాట్లు పడుతున్నారని చెప్పారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్న ఇంజినీరింగ్ కార్మికుల కుటుంబాలు పస్తులతో బతకాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నవంబర్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు చెల్లించడంలో అలసత్వం ప్రదర్శిస్తే ఆందోళనకు సిద్ధమ వ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను, తమ కుటుంబ సభ్యుల ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కోసం అత్యంత కఠినమైన పరిస్థితులలో ప్రజలకు ఆరోగ్య సేవలు చేసిన కోవిడ్-19 పారిశుధ్య కార్మికులను కనీసం ఆప్కాస్‌లో చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. వీరికి కూడు, గుడ్డ, నీడ కల్పించాలని చెప్పారు. కంప్యూటర్లలో మున్సిపల్ కార్మికుల పేర్లు తొలగించి వీరికి ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.మస్తాన్, ఎం.ఆసిబాబు, నాగరాజు, జయసింహ, హరి పాల్గొన్నారు.



డివిజన్ పర్యటనలో మాట్లాడుతున్న సుంకర రవి


సిసి రోడ్డు నిర్మాణంలో టిడిపి నాయకులు

గ్రామాల అభివృద్ధే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి - ఖాజీపేట

గ్రామ పంచాయతీల అభివృద్ధే టిడిపి ధ్యేయమని స్థానిక ఎంపిటీసీ సభ్యులు డీఎస్ చంద్ర భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌ఛార్జ్ లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మేజర్ పంచాయతీ పరిధిలోని నందిపాడు గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అభివృద్ధికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిపాడు టిడిపి నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథలకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ముద్దనూరు



సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రొద్దుటూరు వారి ఆధ్వర్యంలో బుధవారం కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాథాశ్రమంలో డాక్టర్ ఎమ్ఎస్ తేజ కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం శెట్టివారిపల్లి మండాది బసిరెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ పాల్, సొసైటీ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి, కార్యదర్శి చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగభవానీ ,రెబకా, దినేష్, ఆశ్రమ నిర్వాహకులు ఇమ్మానియెల్ పాల్గొన్నారు.

కడప 'ఉక్కు'పై మోడీ ప్రభుత్వం మోసం

ప్రజాశక్తి - వేంపల్లె

కడప స్టీల్ ప్లాంట్‌పై మోడీ ప్రభుత్వం మోసం చేసిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప ఉక్కు కర్మాగారం అంశం ప్రస్తుతానికి మా ముందు లేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి లోక్‌సభలో చెప్పడం దురదృష్టకరమన్నారు. రాయలసీమలో ప్రత్యేకించి కడప జిల్లాలో నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర విభజన చట్టంలో 13వ షెడ్యూల్‌లో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మించాలని ఉందన్నారు. అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ఉక్కు కర్మాగారం నిర్మాణానికి కావలసిన భూమి, నీరు, విద్యుత్ శక్తి, రవాణా సౌకర్యాలు, ముడిసరుకు సున్నపురాయి, డొలమైట్ ఉన్నాయన్నారు.

జమ్మలమడుగు రూరల్ : పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కడప ఉక్కు సమస్య తమ దగ్గర లేదని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అనడం.. కడప ఉక్కుపై వివక్షత స్పష్టంగా కనబడుతోందని, దీన్ని డివైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందని ఆ యూనియన్ జిల్లా కారదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదటి నుండి కడప ఉక్కుపై వివక్షత చూపుతూ వస్తోందన్నారు. కడప ఉక్కుపై రాష్ట్రంలోని ఎంపీలు, అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పెదవి విప్పి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కనీసం తమ పోరాటాల్లో భాగమై కలసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్ష కడప ఉక్కును సాధించుకుందామన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

బద్వేలు : పార్లమెంటు సమావేశాలలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కడప ఉక్కు సమస్య మా దగ్గరలేదని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదటి నుండి కడప ఉక్కు పైన వివక్షత చూపుతోందన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్, షరీఫ్, ఎస్‌కె ఆదిల్ రూలర్, కార్యదర్శి యు బాలగురయ్య పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


సిఐ నరసింహులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పులివెందుల అర్బన్ సీఐ టి.నరసింహులు పేర్కొన్నారు. పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన అన్నమయ్య జిల్లా ఎర్ర చందనం స్టార్‌స్పోర్ట్స్‌లో పనిచేస్తూ పులివెందులకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న జీవన్ గంగానాథ్ బాబు బదిలీపై వెళ్లారు.

సమావేశం హర్షణీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ నెల 7న ప్రభుత్వం ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాగే ప్రయివేట్ పాఠశాలల్లో కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో వసతుల లేమిని నియంత్రించాలన్నారు. ఒత్తిడిలేని విద్యను అందించాలన్నారు. ప్రయివేట్ ఉపాధ్యాయల సమస్యలను చర్చించాలన్నారు.

నాఫెడ్‌కు భూమి కేటాయించాలని సిఎంకు వినతి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరులో నాఫెడ్ సంస్థకు భూమి కేటాయించాలని మైదుకూరు రైతు సంఘం నాయకులు బిపి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబుకు బుధవారం మంగళగిరిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరులో నాఫెడ్ సంస్థకు భూమి కేటాయింపు విషయం, వనిపెంట రెవెన్యూ గ్రామ పరిధిలో ఉల్లి పరిశోధన కేంద్రం (ఎన్‌హెచ్‌ఆర్‌డిఎఫ్)కు భూమి కేటాయింపు గురించి గతంలో పలుదపాలు వినతిపత్రాలు అందజేశామన్నారు. గత ఆగస్టులో ఇ-మెయిల్ ద్వారా సమాచారాన్ని అందించామన్నారు. నేడు ప్రత్యక్షంగా మరోమారు వినతిపత్రం సమర్పిస్తున్నామన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని నందిపాడులో ఉంటున్న వృద్ధురాలు రమణమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబ సభ్యులు ఎవరూలేరు. విషయం తెలుసుకున్న శ్రీవెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్‌రెడ్డి తన మిత్ర బృందంతో గ్రామానికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అనాథ, అభాగ్యుల కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సందడి అమర్నాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం.. రైతుల్లో దైన్యం

ప్రజాశక్తి - వేంపల్లె

తుపాను ప్రభావంతో వరి ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకోగా.. జోరు వానతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వీరన్నగట్టుపల్లె, కుమ్మరాంపల్లె, ఇడుపులపాయ, వేంపల్లె గ్రామాల రైతులు వరి పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టారు. మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి ఆయా గ్రామాల రైతులు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి పోయింది. వర్షపు నీటిలో కొంత ధాన్యం కొట్టుకు పోయినట్లు రైతులు వాపోయారు. చేతికి వచ్చిన ధాన్యం తడిసిపోవడంతో నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రారని ఆందోళన చెందుతున్నారు. ధాన్యం చుట్టూ నీరు నిల్వ ఉండడంతో తొలగించేందుకు రైతులు అవస్థలు పడ్డారు. దిగుబడి బాగా వచ్చినప్పటికీ ఆర బెట్టిన ధాన్యం తడిసి పోవడంతో నష్టం కలిగిందని పేర్కొన్నారు. వర్షం పడగానే ప్లాస్టిక్ పట్టలు వేసి వరి ధాన్యాన్ని కప్పి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


వర్షానికి తడిసిన ధ్యానాన్ని చూపుతున్న రైతు

అనారోగ్యంగా ఉంటే రక్తపరీక్షలు చేయించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్ నాయక్

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో ఎక్కడైనా ప్రజలు అనారోగ్యంగా కనిపిస్తే వెంటనే రక్తపరీక్షలు చేయించాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పలు రికార్డులు, రిపోర్టులు, రిజిస్టర్‌లు, ప్రయోగశాల, మందుల గది, కాన్పుల గది, వైద్య సిబ్బంది ప్రగతి రిపోర్ట్స్‌ను పరిశీలించారు. అనంతరం లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రయిడే పాటించాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని ప్రజలకు సూచించాలన్నారు. 'దోమ పుట్టకూడదు.. కుట్టకూడదు' అనే నినాదాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు రాజేష్‌కుమార్, ఓబులేస్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో ఏ విధమైన అంటువ్యాధులు లేవని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, ఆశా నోడల్ అధికారి సుకన్య, సూపర్‌వైజర్స్ సరస్వతి, బాబురెడ్డి, ప్రసాద్, ఫార్మసీ అధికారి సుభాషిణి, ల్యాబ్ టెక్నీషియన్ పద్మ, వైద్య సిబ్బంది సునీత, అరుంధతి పాల్గొన్నారు.

బత్తాయిలో పొలుసు పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

బత్తాయి పంటలో పొలుసు పురుగు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కడప కెవికె కీటక విభాగపు శాస్త్రవేత్త వి.శిల్పకళ రైతులకు సూచించారు. ఆకుతోటపల్లి గ్రామంలో బుధవారం ఎఒ వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త వి.శిల్పకళ మాట్లాడుతూ బత్తాయి తోటల్లో పొలుసు పురుగు నివారించేందుకు మొదలు దగ్గర బెరడుపై గోనె సంచితో రుద్ది డైమిథియేట్ 2 ఎమ్ఎల్ లేదా ఇమిడాక్లోపిడు 0.5 ఎమ్ ఎల్ ఒక లీటరు నీటిలో కలిపి బెరడు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. బంక తెగులు నివారణకు భోర్డో పేస్టు మిశ్రమాన్ని బెరడుకు పట్టించాలన్నారు. మంగునల్లి ఎక్కువగా ఉంటే స్పైరోమేసిపెన్ 0.8ఎమ్ఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఎఒ మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు కాకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : రబీలో సాగు చేసిన ఆరు పంటల్లో క్రిమికీటకాలు సోకగానే వ్యవసాయ సిబ్బంది సూచనలు పొంది వెంటనే మందులు పిచికారి చేయాలని ఎఒ మ్యాగీ తెలిపారు. బుధవారం సోమాపురం, నాగాయపల్లె గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నూర్పిడి కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. నూర్పిడి చేసిన రైతులు టార్పాలిన్ పట్టలతో ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్త పడాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు రైతుసేవాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏవైనా పంటలలో తెగుళ్లు, చీడపీడలు సోకినట్లయితే వెంటనే తమకు సమాచారం ఇస్తే శాస్త్రవేత్తలను పిలిపించి పరిష్కారం చూపిస్తామన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15లోగా బీమా నగదు చెల్లించాలన్నారు. వ్యవసాయధికారుల సూచనలను తప్పక పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విఎఎ పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని సుగాలి బిడికి, చిన్న కాంపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురవడంతో పడిపోయిన వరి పంటను నిలబెట్టి జడల మాదిరిగా కట్టుకోవాలని సూచించారు. 5శాతం శాతం ఉప్పు ద్రావణాన్ని వరి పంటపై పిచికారి చేయాలన్నారు. వర్షం ఆగిపోయే వరకు పంటకోతను వాయిదా వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.ఈశ్వర్‌రెడ్డి, విఎఎలు భాగ్యమ్మ, రామ్మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వల్లూరు : మండలంలో సాగుచేసిన మినుము పంట దశను బట్టి పురుగు మందులు వాడాలని కెవికె కో-ఆర్డినేటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వీరయ్య తెలిపారు. మండల కేంద్రంలోని గోటూరు రైతులు సాగు చేస్తున్న మినుము పంటను బుధవారం కమలాపురం వ్యవసాయ సహాయకులు నరసింహారెడ్డి, ఎఒ సాయి జ్యోతి, శాస్త్రవేత్త పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ మినుము పంట లో వైరస్ తెగులు అధికంగా వ్యాప్తి చెందిందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రబీలో సాగు చేయబోతున్న వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించుకోవాలని ఎఒ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. సున్నపురాళ్లపల్లె గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటను పరిశీలించారు. జమ్మలమడుగు, ఉప్పలపాడు గ్రామాల్లో శనగ పంటను కెవికె శాస్త్రవేత్త ఉమామహేశ్వరి సందర్శించి, రైతులకు తగు సూచనలిచ్చారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ ఆర్‌డి సంజీవ్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాలను బుధవారం ఆయన సందర్శించారు. స్థానికులతో మాట్లాడారు. గోల్డన్ ప్లాజా, పుట్టపర్తి సర్కిల్ వద్దనున్న పాత తృప్తి బేకరి ప్రాంతం, కూరగాయ మార్కెట్ ప్రాంతాలను సందర్శించారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు అధికంగా ఉన్నాయని పలువురు అధికార పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చారు. 13వ వార్డు కౌనిలర్ ఇర్ఫాన్‌బాషా అధికారుల అలసత్వానికి నిరసనగా సమావేశ మందిరంలోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పరిస్థితుల తీవ్రత దృష్ట్యా గురువారం ఇక్కడే మకాం వేసి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిం చనున్నట్లు సమాచారం. పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు టౌన్ ప్లానింగ్ అధికారిని గురువారం కలిసి అక్రమ నిర్మాణాల గురించి ఆధారాలతో వివరించనున్నట్లు తెలిసింది. టౌన్‌ప్లానింగ్ అధికారి పర్యటనలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగుళూర్‌కు చెందిన ప్రముఖ కంపెనీ టిఓటి ఎప్టి ప్రయివేట్ లిమిటెడ్ బి.టెక్ అన్ని బ్రాంచులకు సంబం ధించిన ఫైనలియర్ విద్యార్థులకు జావా ఫుల్ స్టాక్ డెవలపర్ ట్రైనీ ఉద్యోగాల నిమిత్తం ఎంపికలు నిర్వహించారు. ప్రాంగణ ఎంపికలో పలువురు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. షేక్ బాసిద్ అహమ్మద్, బండి సురేష్, అల్లే నిఖిత ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఏడాదికి రూ.4.6 లక్షల వేతనం ఇవ్వనున్నట్లు టిపిఒ సునీల్ తెలిపారు. విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వేంకటేశ్వరరెడ్డి, హెచ్‌వోడిలు అభినందించారు.

ఆరోగ్య పరిరక్షణలో వ్యాయామం తప్పనిసరి

చాపాడు : ఆరోగ్య పరిరక్షణలో వ్యాయామం తప్పనిసరి అని మిస్టర్ ఇండియా బాడీ బిల్డర్ మోపిరి రాజారెడ్డి తెలిపారు. చాపాడులో బి సురేష్‌బాబు, ఏసన్న ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ జిమ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చాలామంది వ్యాయామానికి సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కూటమి ప్రభుత్వంలో అటకెక్కిన విద్యా విధానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యావిధానాన్ని అటకెక్కించిందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డి విమర్శించారు. స్థానిక వైసిపి నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత జగనన్న హయాంలో రాష్ట్రంలో అక్షరాస్యత పెంచేందుకు పలు పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం ఆ విధానాలన్నిటినీ అటకెక్కించేసిందన్నారు. తల్లికివందనం పథకంలో ఎలాంటి సహాయం చేయలేదని తెలిపారు. దొరసానిపల్లి, రామాపురం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిందన్నారు. నాసిరకం భోజనం పిల్లలకు పెడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు మానుకొని అభివృద్ధి, సంక్షేమం పట్ల దృష్టి సారించాలని రాచమల్లు సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ పథకాలు వినియోగం చేసుకొని విభిన్నప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఇఒ నాగ స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు స్వీట్లు, పండ్లతోపాటు ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2నాగరాజు, ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వరదకిషోర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాల వారీగా ఈనెల 6నుంచి జనవరి 8వరకు ఆయా గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ శాఖల అధికారులు సదస్సులో పాల్గొననున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరద కిషోర్‌రెడ్డి కోరారు. **చాపాడు :** మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుండి సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. 6న శుక్రవారం కేతవరం, 7న నెర్రవాడ, 10న, 11న పల్లవోలు, 12, 13న మడూరు, 17న సోమాపురం, 18న పిచ్చపాడు, 20న చియ్యపాడు, 21న వెంగన్నగారి పల్లి, 24న తుమ్మలపాడు, 26న చిన్న గురవలూరు, 27న బూడిదపాడు, 28న కుచ్చుపాపలో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో జనవరి నెలలో సదస్సులు ఉంటాయన్నారు. రైతులు ఈ సదస్సులలో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.

ఖాజీపేట : భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. గురువారం కొమ్మలూరు, 7న త్రిపురవరం, 10న ఏటూరు, 11న తవ్వారుపల్లి, 12న భూమాయపల్లె, బి.కొత్తపల్లి, 13న ఖాజీపేట, 17న పత్తూరు, 18న పుల్లూరు, 19న అప్పనపల్లె, 20న నాగసానిపల్లె, 21న రావులపల్లె, 24న దుంపలగట్టు, 26న చెన్నముక్కపల్లె, 27న తుడమలదిన్నె, 28న మిడుతూరు, 31న చెముళ్లపల్లి, కొత్తపేట, జనవరి 2న బుడ్డాయిపల్లె రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

క్రైం కార్నర్

ఉప్పరపల్లెలో యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - చెన్నూరు

మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సంగటి ఉమా మహేశ్వర్‌రెడ్డి(26) విష ద్రావణం సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమా మహేశ్వర్‌రెడ్డి కారుడ్రైవర్‌గా పనిచేస్తూ, వ్యవసాయ పనులు కూడా చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రోజు మాదిరే బుధవారం తెల్లవారుజమున పుష్పగిరి రోడ్డుకు నడకకు వెళ్లాడు. దారిలో విషద్రావణం సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నూరు సిఐ పురుషోత్తమరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకుగల కారణాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ముద్దనూరు రోడ్డు పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తెల్లవారుజామున హుస్సేన్‌వలి టీ అంగడి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. స్థానికులు హుస్సేన్‌వలి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.